నమస్తే తెలంగాణ

సిద్దిపేట

I హైదరాబాద్, మంగళవారం 3 డిసెంబర్ 2024 SIDDIPET


## ఆలోచింపజేస్తున్న కేసీఆర్ చిత్రం



'కేసీఆర్' చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శింపజేసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న నియోజకవర్గ స్థాయి నాయకులు

- గుమ్మడిదలలో కేసీఆర్ చలనచిత్రాన్ని ప్రారంభించిన బీఆర్ఎస్ నాయకులు

గుమ్మడిదల, డిసెంబర్ 2: బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రాకింగ్‌రాకేశ్ తీసిన సినిమా చరిత్రలో నిలిచిపోతుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, ఆదర్శ్‌రెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, జిన్నారం వెంకటేశ్‌గౌడ్ అన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలోని శ్రీవెంకటేశ్వరస్వామి సినిమా థియేటర్‌లో 'కేసీఆర్' చిత్రాన్ని రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి సొంత ఖర్చులతో మూడు రోజులు ప్రదర్శించే షోను బీఆర్ఎస్ నాయకులు ప్రారంభించారు. ఈ సినిమా చూడటానికి ఉమ్మడి జిన్నారం మండలంలోని బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉచిత ప్రదర్శనకు ముందుకు వచ్చిన చిమ్ముల గోవర్ధన్‌రెడ్డిని పలువురు బీఆర్ఎస్ నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేసీఆర్ చిత్రం అందరినీ ఆలోచింపజేస్తున్నదన్నారు. ఇలాంటి ఉత్తమ కథను తీసుకుని కేసీఆర్ చిత్రం తీయడం అభినందనీయమన్నారు. తెలంగాణ కోసం ఆయన చేసిన ఉద్యమాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆలోచింప జేసిన ఘనత ఉద్యమనేత, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కే దక్కుతున్నదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు చిమ్ముల నర్సింహారెడ్డి, హన్మంత్‌రెడ్డి, ఆలేటి నవీనాశ్రీనివాస్‌రెడ్డి, మంద భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, నాయకులు సోలకపల్లి ప్రభాకర్‌రెడ్డి, సూర్యనారాయణ, మహిపాల్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, వాసుదేవారెడ్డి, దేవేందర్‌రెడ్డి, రమణారెడ్డి, భాస్కర్, ఆంజనేయులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం మొండిచేయి చూపించింది



రెండు లక్షల పంటరుణమాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం మొండిచేయి చూపించింది. బ్యాంక్‌లో పంట రుణం తీసుకోగా వడ్డీతో కలిపి రూ.1,80,000 అయ్యింది. ప్రభుత్వం రెండు లక్షలు పంటరుణమాఫీ చేశామన్న జాబితాలో పేరు లేదు. పంటరుణమాఫీ కాలేదని బ్యాంక్ అధికారులను అడిగితే జాబితాలో పేరు రాలేదన్నారు. వ్యవసాయాధికారులను అడిగితే మీ ఇంట్లో ఒకే రేషన్ కార్డు మీద భార్యాభర్తలది కలిపి రూ.2,15,000 రుణం ఉన్నందున మాఫీ కాలేదని, తర్వాత విడతలో అవుతుందని సమాధానం చెప్పారు. తనతో పాటు భార్య లక్ష్మి పేరు మీద ఉన్న రూ.35,000 క్రాప్‌లోన్ కూడా మాఫీ కాలేదు. రెండు లక్షల పంటరుణమాఫీ చేశామని ముఖ్యమంత్రి, మంత్రులు అబద్ధం చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇవేమీ సాకులు చెప్పలేదు, ఇప్పుడెందుకు మోసం చేస్తున్నారో అర్థం కావడం లేదు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల పంట రుణం మాఫీ చేయాలి.

*– ఆశిలి నర్సింహులు, బ్రాహ్మణపల్లి, నర్సాపూర్ మండలం, మెదక్ జిల్లా*

# రైతులకు కాంగ్రెస్ ధోఖా

## రేవంత్ పాలన.. రైతన్నలకు శాపం.. రెండు లక్షల పంటరుణమాఫీ ఎగ్గొట్టిన సర్కార్

- రైతు భరోసాకు దిక్కేలేదు
- ఎన్నికల ముందు అమలుకానీ హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్
- సీఎం రేవంత్‌రెడ్డికి తగిన బుద్ధి చెప్తామంటున్న రైతులు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో ఆందోళనలో అన్నదాతలు



సిద్దిపేట, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అసెంబ్లీ ఎన్నికల ముందు అమలు కానీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత రైతులకు మొండిచేయి చూపింది. ప్రతి రైతుకు రెండు లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు రైతులకు ఎగ్గొట్టాడు. దీంతో రైతులు తీసుకున్న పంట రుణాలకు అసలు మిత్తి కలిసి తడిసి మోపెడు అయ్యాయని రైతులు వాపోతున్నారు. ఒకటో విడతలో పంటరుణమాఫీ కాలే.. రెండో, మూడో, నాలుగో విడతలో పంటరుణమాఫీ కాలే.. ఏ విడతలోనూ పంట రుణమాఫీ కాలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు లక్షల పంటరుణమాఫీ చేస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కొర్రీలు పెట్టి రైతులకు మొండి చేయి చూపిందని ప్రభుత్వంపై రైతులు కన్నెర్ర జేస్తుండ్రు. ఎలాంటి షరతులు లేకుండా తమకు పంట రుణమాఫీ చేయాలని రైతులు నినదిస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి షరతులు లేకుండా లక్ష వరకు పంటరుణమాఫీ చేసిందని రైతులు గుర్తు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొర్రీలు పెట్టి రైతులను నిలువునా మోసం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత రైతు బంధు ఎగ్గొట్టింది. పంటరుణమాఫీ సక్కగా చేయకపాయే అని రైతులు వాపోతున్నారు.

### రేవంత్ సర్కార్‌పై మండి పడుతున్న రైతులు

యాసంగి సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో రైతులు యాసంగి సాగులో భాగంగా తుకం పోసే పనుల్లో నిమగ్నమయ్యారు. రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉండాల్సిన సమయంలో .. సీఎం రేవంత్‌రెడ్డి తీరుతో రైతుల ఆశలు ఒక్కసారిగా నీరుగారాయి. పంట రుణమాఫీ కాకపాయే, అటు పంట పెట్టుబడి సాయం రాకపాయే అని రైతులు సావుకార్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. పంట రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం దోకా చేసిందని రైతులు మండిపడుతున్నారు. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో రైతులు ఆందోళనలో ఉన్నారు. ప్రభుత్వం రైతులకు పంటరుణమాఫీ చేశామని గొప్పలు చెప్పుకుంటుంది కానీ క్షేత్ర స్థాయిలో అందుకు విరుద్ధంగా ఉంది. ఏ గ్రామంలో చూసినా పంటరుణమాఫీ కాని రైతులే కనిపిస్తున్నారు. ప్రభుత్వం రైతులకు పంట రుణమాఫీ ఎగ్గొటిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేక కొర్రీలు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నదని రైతులు ఆరోపిస్తున్నారు.

### కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం చేసి చూపిండు

గతంలో కేసీఆర్ ప్రభుత్వం లక్ష వరకు పంట రుణమాఫీ చేసింది. అప్పటి ఇప్పటి లెక్కలకు చూసుకుంటే పంటరుణమాఫీ రైతుల సంఖ్యను కాంగ్రెస్ ప్రభుత్వం భారీగా తగ్గించింది. రెండు లక్షల వరకు పంట రుణమాఫీ చేస్తే రైతుల సంఖ్య పెరగాలి గానీ తగ్గింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్ష పంటరుణమాఫీ చేసినప్పుడు ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తం 4,17,591 మందికి పంటరుణమాఫీ జరిగింది. 2014లో ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,50,000 మంది రైతులకు రూ.398 కోట్లు బీఆర్ఎస్ ప్రభుత్వం మాఫీచేసింది. 2018లో సిద్దిపేట జిల్లాలో 81,565 మందికి రూ. 418 కోట్లు, మెదక్ జిల్లాలో 73,026 మందికి రూ. 366.39 కోట్లు, సంగారెడ్డి జిల్లాలో 1,13,000 మందికి రూ. 678 కోట్లు మాఫీ చేసింది. ఇదంతా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్షలోపు పంటరుణమాఫీ జరిగింది. మొత్తంగా 4,17,591 మందికి రూ. 1,860. 39 కోట్లు పంటరుణమాఫీ చేసి బీఆర్ఎస్ రైతు ప్రభుత్వమని చెప్పుకుంది. ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల వరకు రైతులకు పంటరుణమాఫీ చేశామని చెప్పుకుంటుంది. మరి వీరు చేసింది ఎంత అంటే 2,85,493 మంది రైతులకు పంటరుణమాఫీ చేశారు. అంటే కాంగ్రెస్ ప్రభుత్వం 1,32,098 మంది రైతులకు కోత పెట్టింది. రైతుల సంఖ్య పెరగాల్సి ఉండగా పూర్తిగా కోతలు పెట్టింది. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొన్నది.

### రూ.2 లక్షల పంటరుణమాఫీ కాలేదు



కాంగ్రెస్ ప్రభుత్వంలో నాకు, నా భర్తకు రూ.2 లక్షల పంటరుణమాఫీ కాలేదు. నా పేరు మీద 3.16 ఎకరాల భూమి ఉంటే రూ.1.50 లక్షలు, నా భర్త ర్యాకం బాబు పేరు మీద 2.20 ఎకరాల భూమి ఉంటే రూ1.30 లక్షల పంటరుణాలు తీసుకున్నాం. మేము ఇద్దరం కలిసి బ్యాంకు నుంచి మొత్తం రూ.2.80 లక్షల రుణం పొందాము. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల మాఫీ చేసినట్లు చెప్తున్నది కానీ మాకైతే పంటరుణమాఫీ కాలేదు. ప్రభుత్వం కాకి లెక్కలు చెప్పడం కాదు కనీసం మా ఇద్దరిలో ఒక్కరికైన పంటరుణమాఫీ చేస్తే బాగుంటుంది. సీఎం రేవంత్ రెడ్డి సారు చెప్పేది ఒకటి చేసేది మరొకటి అన్నట్లుగా ఉన్నది.

*–ర్యాకం లక్ష్మి, మహిళా రైతు, మిరుదొడ్డి, సిద్దిపేట జిల్లా*

### అర్హత ఉన్నా పంటరుణమాఫీ కాలే



ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంటరుణమాఫీకి నేను అర్హుడిని. నాకు రెండున్నర ఎకరాల భూమి ఉంది. 2019లో హద్నూర్ కెనరా బ్యాంకులో రూ.1.70 లక్షల పంట రుణం తీసుకున్నా. నాలుగు విడతల వరకు పంటరుణమాఫీ అయితదని ఆశతో ఎదురు చూస్తే నిరాశే మిగిలింది. రూ. రెండు లక్షలలోపు పంట రుణమాఫీ ప్రకటించిన జాబితాలో నా పేరు లేదు. పంటరుణమాఫీ ఎందుకు కాలేదని సంబంధిత బ్యాంకు అధికారులను అడిగిన ఎలాంటి సమాధానం ఇవ్వ లేదు. వ్యవసాయాధికారుల వద్దకు వెళ్తే వస్తాయంటున్నారు. ప్రభుత్వం వందశాతం పంటరుణమాఫీ చేశామని గొప్పలు చెప్పుకుంటున్నది. మా పరిస్థితేమో గిట్ల ఉన్నది.

*– ఆశప్ప, రైతు, హద్నూర్, న్యాల్‌కల్ మండలం, సంగారెడ్డి జిల్లా*

## గురుకులంలో సమస్యల తిష్ట



ప్రజ్ఞాపూర్ గురుకులంలో అన్నం, కూరలను పరిశీలిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

- గురుకుల పాఠశాలల్లో అన్నీ సమస్యలే..
- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, డిసెంబర్ 2: గురుకుల పాఠశాలలు అద్దె భవనాలు.. అరకొర వసతులతో కొనసాగుతున్నాయని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం బీఆర్ఎస్ గురుకుల బాటలో భాగంగా సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్‌లోని బాలుర గురుకుల పాఠశాల, కళాశాల, మైనార్టీ పాఠశాల, కేజీబీవీని సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న భోజన సదుపాయాలు, మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలు చేసేందుకు, లబ్ధి పొందేందుకు గురుకులాల బాట పట్టలేదన్నారు. కాంగ్రెస్ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 48 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారన్నారు. రాష్ట్రంలోని గురుకులాల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో సరైన పౌష్టికాహారం అందక, అద్దె భవనాల్లో సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యార్థుల మృతికి కారణమైన సీఎం రేవంత్‌రెడ్డి నైతికబాధ్యత వహించి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పాలనను గాలికి వదిలేసి విద్యార్థులను పొట్టన పెట్టుకుంటున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జింకల పర్వతాలు యాదవ్, జంగిటి కమలాకర్, పరశురాములు, బీఆర్ఎస్ అధ్యక్షుడు నవాజ్‌మీరా, కుమార్, నాయకులు రమేశ్‌గౌడ్, నిజాం, ప్రవీణ్, నవాజ్, మోహన్‌బాబు, కనకరాజు, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్వీ నాయకులను అడ్డుకున్న పోలీసులు



చిన్నకంజర్లలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

పటాన్‌చెరు, డిసెంబర్ 2: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్వీ నాయకులు హాస్టళ్లను సందర్శించేందుకు వెళ్లగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం చిన్నకంజర్లలోని మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలో ఉన్న సమస్యలు తెలుసుకునేందుకు బీఆర్ఎస్ నియోజకవర్గ విద్యార్థి విభాగం నాయకులు వెళ్లారు. అప్పటికే గేటు ముందు పహారా కాస్తున్న పోలీసులు బీఆర్ఎస్వీ నాయకులను అడ్డుకున్నారు. లోపలికి అనుమతి లేదని చెబుతూ గేట్లు మూసివేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు కమ్మెట చెన్నారెడ్డి, నాయకులు మాణిక్‌యాదవ్, సాయికిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టళ్లను సందర్శించడం కూడా కాంగ్రెస్ నిషేధించడం విచారకరమన్నారు. ప్రభుత్వం హాస్టళ్లను నిర్లక్ష్యం చేస్తూ బడుగు, బలహీన వర్గాల నుంచి వచ్చిన పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నదని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హాస్టళ్లను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి విద్యార్థులకు మంచి భవిష్యత్ ఇస్తే కాంగ్రెస్ హాస్టళ్లలో పురుగులు పట్టిన, పాచిపోయిన అన్నం పెడుతూ వారి ఆరోగ్యాలను పాడుచేస్తున్నదని ఆరోపించారు. పోలీసుల పహారాలో విద్యా సంస్థలు, హాస్టళ్లు ఉంచడం ప్రజలు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## బీఆర్ఎస్వీ నాయకుల అరెస్టు




సంగారెడ్డి పీఎస్ ఆవరణలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 2: జిల్లాలో గురుకుల బాట పట్టిన బీఆర్ఎస్వీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. గురుకుల పాఠశాలలు, కేజీబీవీ, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకు బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో గురుకుల బాటకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. సోమవారం సంగారెడ్డిలోని కస్తూర్బా గురుకుల పాఠశాలను సందర్శించేందుకు బయలుదేరిన బీఆర్ఎస్వీ నాయకులను పట్టణ పోలీసులు అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ నాయకులు మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో విద్యార్థి ఉద్యమాలను ఆపలేరని స్పష్టం చేశారు. వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకోవడం తప్పా అని వారు ప్రశ్నించారు. అరెస్టు అయిన వారిలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గురుకుల బాట జిల్లా ఇన్‌చార్జి పడాల సతీశ్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేందర్ నాయక్, నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీహరి, నాయకులు రోషన్, సందీప్, రాము, వెంకట్, జయేందర్, లక్ష్మణ్, అఖిల్ తదితరులు ఉన్నారు.

## ఎక్కడి సమస్యలు అక్కడే..

- మైనార్టీ హాస్టల్‌ను సందర్శించిన బీఆర్ఎస్వీ నాయకులు



తాగునీటి నల్లావద్ద పేరుకుపోయిన పాచు



విద్యార్థులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ నియోజవర్గ ఇన్‌చార్జి శ్రీహరి

సదాశివపేట, డిసెంబర్ 2: బీఆర్ఎస్ గురుకుల బాటలో భాగంగా సోమవారం సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలోని మైనార్టీ బాలుర హాస్టల్‌ను బీఆర్ఎస్వీ నాయకులు సందర్శించారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్దగొల్ల శ్రీహరి మాట్లాడుతూ హాస్టల్‌లో టాయిలెట్లు అపరిశుభ్రంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. విద్యార్థులకు అందించే భోజనంలో కుళ్లిపోయిన టమాటాలు వాడుతున్నారని ఆరోపించారు. తాగునీరు, స్నానాలు చేసే దగ్గర పాచి పట్టిన గోడలు దర్శనమిస్తున్నాయన్నారు. సొంత భవనం ఉన్నా అద్దె భవనంలోనే హాస్టల్ కొనసాగుతున్నదని విమర్శించారు. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్వీ మండల, పట్టణ అధ్యక్షులు పాండునాయక్, రోషన్, నాయకులు అక్షయ్, తరుణ్, నాజర్, నవీన్ పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

- జహీరాబాద్ పట్టణంలోని ఎస్టీ వసతిగృహాన్ని సందర్శించిన బీఆర్ఎస్వీ నాయకులు



జహీరాబాద్‌లోని ఎస్టీ వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీశ్

జహీరాబాద్, డిసెంబర్ 2: విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి పడాల సతీశ్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సోమవారం జహీరాబాద్ పట్టణంలోని ఎస్టీ బాలుర వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. వసతి గృహంలో నెలకొన్న సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహంలో సోలార్ ప్లాంట్ పాడై విద్యార్థులు స్నానాలు చేసేందుకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. వసతి గృహంలోని పరిసరాలు శుభ్రంగా లేక దోమలు, ఈగల వల్ల డెంగ్యూ, మలేరియా వంటి జబ్బుల బారిన పడి విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. వసతి గృహంలో సరిపడా ఫ్యాన్లు, మూత్రశాలలు, మరుగుదొడ్లు సక్రమంగా లేవని ఆరోపించారు. ఆయన వెంట బీఆర్ఎస్వీ నాయకులు రాకేశ్, బండిమోహన్, రవికిరణ్, ఓంకర్, ఫయాజ్, అశోక్‌రెడ్డి, శివప్ప, మనోజ్ ఉన్నారు.

## జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్

- బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి బూసాని వెంకటేశ్వరరావు



బూసాని వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేస్తున్న బీసీ సంఘాల నాయకులు

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 2: స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లను అమలు చేసేందుకే బీసీ డెడికేటెడ్ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి బూసాని వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. సోమవారం సంగారెడ్డి జిల్లాలో పర్యటించిన ఆయన పట్టణంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లాకు సంబంధించిన బీసీ కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ఇతర కుల సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. ఆయా సంఘాల నాయకుల ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీసీ కుల గణన చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. జనాభా ప్రాతిపదికన క్షేత్ర స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం జరిపించిన సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా పూర్తిస్థాయిలో జనాభా వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు.

### బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్‌కు స్వాగతం

అంతకుముందు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో బీసీల స్థితిగతులను వివరించారు. జిల్లాలో కుల గణన సర్వే సజావుగా జరిగిందని కమిషన్ చైర్మన్‌కు తెలిపారు. జిల్లాలోని వివిధ కుల సంఘాల నుంచి 24 వినతులను కమిషన్ చైర్మన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిషన్ మెంబర్ సెక్రటరీ, ఐఎఫ్ఎస్ అధికారి బి.సైదులు, సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, బీసీ సంక్షేమ సంఘం డీడీఆర్ రమేశ్, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి, మెదక్ జిల్లా ఇన్‌చార్జి అధికారి జగదీశ్, సిద్దిపేట జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి అఖిలేష్‌రెడ్డి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, డీఎస్పీ సత్యనారాయణగౌడ్, బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీరయ్యాయాదవ్, ఓడీఎఫ్ ఓబీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటిపల్లి పాండు, వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం అమీరాబాద్ రైతులు

## పంట రుణమాఫీ కోసం రైతుల నిరసన

జహీరాబాద్, డిసెంబర్ 2 : పంట రుణమాఫీ కాకపోవడంపై సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం అమీరాబాద్ గ్రామ రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని చాల్కి ఏపీజీవీబీలో రూ. రెండు లక్షలలోపు పంటరుణం తీసుకున్నామని గ్రామానికి చెందిన రైతులు వైజ్యనాథ్, దత్తరెడ్డి, నర్సింహారెడ్డి, విజేందర్‌రెడ్డి, సుధాకర్‌రావు, సురప్ప, చందర్, నాగ్‌గోండ, సంగారెడ్డి తెలిపారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం రేషన్ కార్డు ప్రకారం కుటుంబ సభ్యులలో ఎవరికైనా ఒకరికి పంటరుణమాఫీ కావాల్సి ఉన్నా కాలేదన్నారు. నాలుగు విడతలుగా పంటరుణమాఫీ అయితదని ఎంతో ఆశతో ఎదురు చూసినా నిరాశే మిగిలిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని నిబంధన ప్రకారం అర్హులకు పంట రుణమాఫీ చేసి ఆదుకోవాలని వారు కోరారు.

## అర్జీలను వెంటనే పరిష్కరించాలి

- మెదక్ డీఆర్వో భుజంగరావు

మెదక్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ప్రజావాణిలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని మెదక్ డీఆర్వో భుజంగరావు అధికారులకు సూచించారు. సోమవారం మెదక్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి జడ్పీ సీఈవో ఎల్లయ్యతో కలిసి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కారదిశగా కృషి చేయాలని సూచించారు. పరిష్కారంకాని అంశాన్ని క్షుణ్ణంగా వివరించి ప్రజావాణిపై ప్రజలకు నమ్మకం కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేరవేసేందుకు కృషి చేయాలని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సత్వర పరిష్కారానికి సంబంధిత జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పింఛన్ కోసం నాలుగు, ధరణి కోసం 37, ఇందిరమ్మ ఇండ్ల కోసం రెండు, ఇతర సమస్యలపై 29, మొత్తం 72 అర్జీలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధితశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## 'మల్లన్న' క్షేత్రంలో కాటేజీ నిర్మాణానికి విరాళం



కాటేజీ నిర్మాణానికి అనుమతి కోరుతూ వినతిపత్రం అందిస్తున్న దాత

చేర్యాల, డిసెంబర్ 2: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రంలో దాతల సహకారంతో నిర్మించనున్న 100 గదుల కాటేజీల భవనంలో ఒక భవనం నిర్మించేందుకు హైదరాబాద్‌లోని గాంధీనగర్‌కు చెందిన మోహన్ కుమార్‌యాదవ్ అనే మల్లన్న భక్తుడు రూ.15 లక్షలను విరాళంగా అందజేసేందుకు ముందుకు వచ్చాడు. ఈ సందర్భంగా ఆలయం అధికారులతో చర్చించి రూ. 15 లక్షలు చెల్లించేందుకు అనుమతి కోరుతూ సోమవారం వినతిపత్రం అందజేశాడు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున మాట్లాడుతూ దాతల సహకారంతో నిర్మించనున్న వంద కాటేజీల వల్ల భక్తులకు ఎంతో మేలు జరుగుతుందని, దాతలు ముందుకు వస్తే కాటేజీలను ప్రారంభిస్తామన్నారు. ఆలయ పర్యవేక్షకులు, ఏఈ, సిబ్బంది ఉన్నారు.